

సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 5: మండలంలోని నమ్లిమెట్ గ్రామానికి చెందిన సుమలతకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును శనివారం మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలను ఆదుకునే దిశగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేయించి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌చారి, నగేశ్, లక్ష్మారెడ్డి, అనిల్‌గౌడ్, నర్సింహులు, బాబు సింగ్, యాదయలు ఉన్నారు.

## తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారి



చిన్నారి ప్రణవిని తండ్రి నాగరాజుకు అప్పగిస్తున్న గుమ్మడిదల పోలీసులు

గుమ్మడిదల, ఏప్రిల్ 5: తప్పిపోయిన చిన్నారిని పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. శనివారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగు గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు కూతురు ప్రణవి(6) 2వ తరగతి చదువుతున్నది. రోజుమాదిరిగానే దోమడుగులోని పాఠశాలకు వెళ్లింది. శనివారం పాఠశాలలకు సెలవు అని తెలిసిన తండ్రి నాగరాజు స్పందించి పాఠశాలకు వెళ్లి చూడగా చిన్నారి అక్కడి కనిపించకపోవడం ఆందోళనకు గురయ్యాడు. నాగరాజు చిన్నారి కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో వెతికగా దోమడుగులో ఒకచోట చిన్నారులతో ఆడుకుంటూ కనిపించింది. దీంతో చిన్నారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రి నాగరాజుకు అప్పగించారు. దీంతో నాగరాజు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. కనిపించకుండా పోయిన చిన్నారిని కొద్దిగంటల్లోని వెతికి అప్పగించడంతో పలువురు పోలీసులను అభినందించారు.

## రేషన్ దుకాణం తనిఖీ

చౌటకూర్, ఏప్రిల్ 5: చౌటకూర్‌లోని రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ అందుతున్నది.. లేనిది డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని రేషన్ దుకాణాలు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు తప్పనిసరిగా తెరిచి ఉంచాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే ప్రజలకు ఈ వేళలు అనుకూలంగా ఉంటాయన్నారు. పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. తూకం కాంటాలపై ఖాళీ బస్తాలు ఉంచి తూకం చేస్తున్నారంటూ పలు గ్రామాల నుంచి పిర్యాదులు అందాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఫిర్యాదులు మళ్లీ వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ హెచ్చరించారు.

## వేటకెళ్లి మత్స్యకారుడు మృతి

జిన్నారం, ఏప్రిల్ 5: మండలంలోని కొడకంచిలో విషాదం చోటుచేసుకుంది. చేపల వేటకెళ్లిన మత్స్యకారుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కంచనపల్లి ఆంజనేయులు(49) పుట్టగూడ సమీపంలోని నల్లచెరువులో శుక్రవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. ఆంజనేయులు రాత్రిఅయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఆరా తీశారు. దీంతో మత్స్యకారులతోపాటు గ్రామస్తులు చెరువులో గాలించగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నాగలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాళ్లకు వల చిక్కుకొని మత్స్యకారుడు మృతి చెందాడని ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీసీతో తొలగనున్న ఇబ్బందులు

జహీరాబాద్, ఏప్రిల్ 5: న్యాల్‌కల్ మండలంలోని అమీరాబాద్‌లో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులతో ప్రజల ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. శనివారం గ్రామంలోని 5వ వార్డు నుంచి శ్రీకృష్ణ మందిరం, 7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఆయా వార్డుల్లో సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సీసీ నిర్మాణంతో ఇబ్బందులు తొలిగిపోనున్నాయని ఆయా వార్డులకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



సదాశివపేట: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు



జహీరాబాద్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



సంగారెడ్డిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు



అందోల్: జోగిపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## అందరికీ స్ఫూర్తిదాయకం

బాబూ జగ్జీవన్‌రామ్ 117 జయంతిని జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమ కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, సంగారెడ్డి, ఏప్రిల్ 5



సంగారెడ్డిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో జిల్లా నాయకులు



సంగారెడ్డిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ బెట్టర్ నాయకులు



జిన్నారం: మాదారంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



న్యాల్‌కల్ మండలం హద్నూర్‌లో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



ఝరాసంగం: జగ్జీవన్ రామ్ చిత్రపటానికి వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో సుధాకర్

## బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేద్దాం



ఆదర్శ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు

రామచంద్రాపురం,ఏప్రిల్ 5: పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేద్దామని నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని ఆయన నివాసంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్‌ఎస్ నేతలు బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశం గౌడ్, రాములు గౌడ్, అంజయ్య, ప్రభాకర్ రెడ్డి, రాజేశ్ తదితరులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదర్శ్ రెడ్డి వారితో మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి వారికి అండగా నిలుస్తామని చెప్పారు. పార్టీ సూచించే కార్యక్రమాలను నియోజకవర్గంలో విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ఆరు గ్యారెంటీల మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల విషయంలో నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత ఉన్నదని, భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లవల్లిలో బర్రెలతో వినూత్న నిరసన



నల్లవల్లిలో బర్రెలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఏప్రిల్5: ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని ఆందోళనకారులు బర్రెలతో వినూత్నంగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ చేపట్టిన డంపింగ్ యార్డు నిర్మాణం పనులు వెంటనే నిలిపి వేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 60వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నల్లవల్లిలో జేఏసీ నాయకులు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రైతు జేఏసీ నాయకులు బర్రెలతో నిరసన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో వీరన్నగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు. కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో కూడా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, నర్సింహారెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, దోమడుగు బాల్‌రెడ్డి, పొన్నబోయిన వేణు, మద్దుల బాల్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, భాస్కర్ గౌడ్, కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బలవంతంగా భూములు తీసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడుద రాంచందర్

జహీరాబాద్, ఏప్రిల్ 5: నిమ్జ్ కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోరాదని, 2013 భూసేకరణ చట్టంలో తొలిగించిన చాప్టర్ 2,3లను యథావిధిగా పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో న్యాల్‌కల్ మండలంలోని గుంజోట్టి, మామిడ్గి, హద్నూర్, హుస్సెల్లి గ్రామాలకు చెందిన నిమ్జ్ భూబాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు కోసం రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూములు సేకరించవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2013 భూసేకరణ చట్టంలో రైతులకు, ప్రజలకు పర్యావరణానికి గుండెకాయ లాంటి చాప్టర్ 2,3 లను తొలిగించి అన్యాయం చేసిందన్నారు. వెంటనే వాటిని యథావిధిగా అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. భూముల సేకరణ కోసం నిమ్జ్ అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్లు, నోటీసులను వెంటనే రద్దు చేయాలని, సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించడం సరికాదన్నారు. సమావేశంలో రైతులు పునీత్ దీక్షిత్, నారాయణరావు, గుండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గాలిరెడ్డి, శివరాజ్, రాములు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 5:అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి నియోజకవర్గానికి రూ.30 లక్షల 60 వేల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కంది మండలానికి సంబంధించి రూ.5 లక్షల 68 వేల 500 విలువ గల 22 చెక్కులు, కొండాపూర్ మండలానికి సంబంధించి రూ.12 లక్షల 42వేల 500 విలువ గల 13 చెక్కులు, సంగారెడ్డి మండలానికి సంబంధించి రూ.2 లక్షల 84వేల విలువ గల 13 చెక్కులు, సంగారెడ్డి పట్టణానికి సంబంధించి రూ.19 లక్షల 2వేల 500 విలువ గల 27 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తు కోసం సంబంధిత పత్రాలను అందజేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలకు బీఆర్‌ఎస్ పాలన గుర్తుకొస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, బీఆర్‌ఎస్ పార్టీ ఆయా మండలాల నాయకులు మధుసూదన్‌రెడ్డి, విఠల్, శ్రీనివాస్ గౌడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు సత్వర న్యాయం అందించాలి



జహీరాబాద్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న న్యాయమూర్తి సుధ

జహీరాబాద్, ఏప్రిల్ 5: పేదలకు సత్వర న్యాయం అందించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో వేద పండితులు ఘన స్వాగతం పలికారు. కోర్టులో ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి, కేసుల పెండెన్సీ దృష్ట్యా జహీరాబాద్‌కు ఏడీజే కోర్టు అవసరం ఉందని, దీని కోసం ఏడీజే కోర్టు మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. జ్యుడీషియల్ డిస్ట్రిక్ట్ ఫార్మేషన్ పూర్తయినందున అందుకు అవసమైన సౌకర్యాలు ప్రాధాన్యత క్రమంలో అందుబాటులోకి రానున్నాయన్నారు. కోర్టుల్లో సౌకర్యాలు కల్పించేందుకు హైకోర్టు ఉత్సాహంగా ఉందన్నారు. స్థానిక కోర్టు భవనాల ఏర్పాటు, ఇతర అవసరాల కోసం 6ఎకరాల భూమి కేటాయించాలని బార్ అసోసియేషన్ అందజేసిన ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 1700 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెషన్ జడ్జి భవానీచంద్ర, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ పారితోష్ పంకజ్, మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ఆర్డీవో రాంరెడ్డి, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు




ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

జిన్నారం, ఏప్రిల్ 5: బీఆర్‌ఎస్ నాయకురాలు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పుట్టినరోజు వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆమెను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సునీతాలక్ష్మారెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిన్నారం, జంగంపేట గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ గులాబీ గజమాలతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో సునీతాలక్ష్మారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శుభాకాంక్షల వెల్లువ**

గుమ్మడిదల, ఏప్రిల్ 5: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా గుమ్మడిదల బీఆర్‌ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, వినోద్‌గౌడ్ సంజీవరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితర శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న హత్నూర బీఆర్‌ఎస్ నాయకులు




గుమ్మడిదలలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

**ఘనంగా పుట్టిన రోజు**

హత్నూర, ఏప్రిల్ 5: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టినరోజును నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. హత్నూర మండలం నుంచి భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నర్సాపూర్ తరలి వెళ్లారు. పలువురు నాయకులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కేక్ కట్ చేయించి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీచైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, నాయకులు రమేశ్‌నాయక్, ఎల్చాల మధు, అంబటి అర్జున్, రవికుమార్, సురేందర్‌రెడ్డి, శంకర్, తోటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి కేసులో ఒకరి అరెస్ట్

అందోల్, ఏప్రిల్ 5: మహిళపై లైంగిక దాడికి యత్నించి...దాడిచేసి గాయపర్చిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ శనివారం తెలిపారు. ఈమేరకు ఆయన వివరాలు వెల్లడించారు. పుల్కల్ మండలం గొంగ్లూకుతండాకు చెందిన మహిళను బుధవారం బొమ్మరెడ్డిగూడెంలో కూలి పని ఉందంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి పిలవడంతో ఆమె వచ్చి చౌటకూర్ బస్టాప్‌లో నిలబడింది. దీంతో మిన్‌పూర్‌కు చెందిన ఆంజనేయులు ఆమెను బైక్‌పై ఎక్కించుకొని బొమ్మరెడ్డిగూడెం అటవీప్రాంతానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేసి ఫోన్ తీసుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

వట్‌పల్లి: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. శనివారం పోతులబొగుడలోని ఆయన స్వ గృహంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. రానున్న రోజులు మనవేనని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## కేతకీలో హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



పూజలు చేస్తున్న న్యాయమూర్తులు

ఝరాసంగం, ఏప్రిల్ 5: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ శ్రీసుధ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తులకు ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతి సమేత సంగమేశ్వర స్వామికి అభిషేకం, మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప న్యాయమూర్తులకు పూలమాలతో సన్మానించి స్వామివారి చిత్రపటంతోపాటు ప్రసాదాన్ని అందించారు. వారి వెంట జిల్లా న్యాయమూర్తి భవానీచంద్ర, జహీరాబాద్ న్యాయమూర్తి శ్రీధర్, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఆర్డీవో రాంరెడ్డి, తిరుమలరావు, రామారావు, శేఖర్ పాటిల్, మల్లయ్య స్వామి ఉన్నారు.

## చెరువులో మృతదేహాలు లభ్యం



నవీన్‌కుమార్, ప్రేమ్‌కుమార్(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 5: బోర్పట్ల శివారులోని బీమునిచెరువులో ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు పడగా శుక్రవారం రాత్రి వరకు గాలించినా దొరకలేదు. శనివారం తెల్లవారుజాము నుంచి చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. గ్రామానికి చెందిన డప్పు నవీన్‌కుమార్(26), కొండాపూర్ మండలం వీరభద్రపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్(36) శుక్రవారం ప్రమాదవశాత్తు చెరువులోపడి గల్లంతయ్యారు. వారి కోసం నర్సాపూర్ అగ్నిమాపక శాఖ సిబ్బంది, మత్స్యకారులు రెండురోజులపాటు గాలింపు చర్యలు చేపట్టడంతో శనివారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నవీన్‌కుమార్‌కు భార్య ఉండగా, ప్రేమ్‌కుమార్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. డప్పు నవీన్ అన్న డప్పు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

## ఎర్రరాయి తరలిస్తున్న లారీలు పట్టివేత



జహీరాబాద్, ఏప్రిల్ 5: అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయి తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్ఐ చల్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం న్యాల్‌కల్ మండలంలోని గణేశ్‌పూర్ శివారులోని తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలో అనుమతులు, పత్రాలు లేకుండా అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న ఏపీ12వీ 1593, ఏపీ12వీ4188, ఏపీ13ఎక్స్1260 లారీలను పట్టుకొని న్యాల్‌కల్ తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు పట్టుకున్న లారీలను హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.